ఉపకారం పేరిట అపకారం

స్కాలర్‌షిప్ వచ్చిందని తల్లిదండ్రులకు ఫోన్లు

ఖాళీ అవుతున్న ఖాతాలు | రాష్ట్రంలో కొత్త తరహా సైబర్ స్కామ్

రూ.25 వేలు స్కాలర్‌షిప్ వచ్చిందనగానే తల్లిదండ్రులు సంబరపడిపోతున్నారు. బ్యాంకు ఖాతా వివరాలు సైబర్ నేరగాళ్లకు ఇచ్చేస్తున్నారు. వెంటనే ఖాతా ఖాళీ అవుతోంది. ఈ తరహా నేరాలు రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే పెరుగుతున్నట్లు సైబర్ పోలీసులు, విద్యాశాఖ అప్రమత్తం చేస్తోంది.

ఈనాడు-చెన్నై

సైబర్ నేరగాళ్లు డబ్బులు కొల్లగొట్టేందుకు ఎన్నో ఎత్తులు వేస్తున్నారు. ముందుగానే విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. ఇందులో విద్యార్థి పేరు, పాఠశాల, చిరునామా, తల్లిదండ్రుల పేర్లు, ఇతర వివరాలుంటున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు సంబంధించిన ఫోన్ నెంబర్లు కూడా వారికి తెలిసిపోతున్నాయి. వాటిసాయంతో ఫోన్ చేసి పిల్లల వివరాలన్నీ తల్లిదండ్రులకు చెబుతున్నారు. 'మీ అబ్బాయి/ అమ్మాయికి స్కాలర్‌షిప్ మంజూరైంది' అంటున్నారు. ఆ మాట వినగానే తల్లిదండ్రులు నిజమే అనుకుంటున్నారు. ఇలా వలలో పడి ఇతర వివరాలు చెప్పేస్తున్నారు. బ్యాంకు ఖాతాకు అనుసంధానమైన నెంబరు అడగటంతో పాటు ఆ నెంబరుపై ఉన్న యూపీఐ ఐడీ సైతం తీసుకుంటున్నారు.



డబ్బులు వేసి లాగేసుకుంటూ..

స్కాలర్‌షిప్ మంజూరైందని ఓ పక్క చెబుతూ, బ్యాంకు వివరాలు, యూపీఐ ఐడీ వివరాలు అడుగుతుండటంతో కొంతమంది తల్లిదండ్రులకు అనుమానమొచ్చింది. ఇలాంటివారు అప్రమత్తమై పోలీసుల్ని సంప్రదించారు. ఇంకొందరు తమ ఖాతాల్లో డబ్బులు పోగొట్టుకున్న తర్వాత సైబర్ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చాలామంది బాధితులు ఉన్నట్లు అంచనాలు తెలుస్తోంది. అందిన ఫిర్యాదుల మేరకు ఒక్కో కుటుంబం రూ. 5వేల నుంచి రూ. 25వేల దాకా డబ్బులు పోగొట్టుకుంటున్నట్లు పేర్కొంటున్నారు. ఓ బాధితురాలు మాట్లాడుతూ.. తమ ఖాతాల్లో ఆ దుండగులు ముందు రూ. 25 వేలు జమ చేశారని, ఇందుకు తామెంతో సంబరపడ్డామని చెప్పారు. ఆ తర్వాత వెంటనే రూ.25 వేలు వెనక్కి తీసుకోవడంతో పాటు తమ ఖాతాలో ఉన్న రూ. 6వేలు కూడా విత్‌డ్రా చేసేశారని వాపోయారు. ఈ తరహా మోసాలు పలు జిల్లాల్లో బయటపడుతున్నాయి.

వివరాలు ఇచ్చిందెవరు?

విద్యార్థులకు సంబంధించిన వివరాలు ఎలా బయటికెళ్లాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయమై విచారణ చేపట్టారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల నుంచి కళాశాలలకు డాటా పంచుకునే సంస్కృతి ఉంది. తద్వారా ఉన్నత చదువులు చదివేందుకు తమ కాలేజీలో పిల్లలను చేర్పించాలంటూ తల్లిదండ్రులకు చాలా ఫోన్లు వస్తుంటాయి. ఇదే తరహాలోనే వివరాలు తీసుకున్నారా, మరో మార్గం ఎంచుకున్నారా అన్నది తేలాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడు ఈ-గవర్నెన్స్ ఏజెన్సీ ద్వారా విద్యార్థుల ఆధార్ కార్డును ఆయా పాఠశాలల్లోనే తీసుకుని తద్వారా స్కాలర్‌షిప్ ప్రక్రియ మొదలుపెట్టే విధానముంది.

మరో రకంగా..

సైబర్ నేరగాళ్లు విద్యార్థుల తల్లిదండ్రులను వాట్సాప్‌లోనూ సంప్రదిస్తున్నారు. విద్యార్థుల వివరాలు జతచేసి.. మీ కుమారుడు/కుమార్తెకు స్కాలర్‌షిప్ మంజూరైందని చెబుతూ నకిలీ క్యూఆర్ కోడ్‌ను వారికి పంపుతున్నారు. స్కాన్ చేయగానే బ్యాంకు ఖాతా వివరాలు తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు.

ఆ విద్యార్థులే లక్ష్యంగా..

ప్రత్యేకించి సైబర్ నేరగాళ్లు కేవలం 10 నుంచి 12వ తరగతి చదివే విద్యార్థుల కుటుంబాలకు మాత్రమే ఫోన్లు చేస్తున్నారని సైబర్ పోలీసుల దర్యాప్తులో తేలింది. ప్రైవేటు పాఠశాలల్లో ఈ తరగతులకు సంబంధించి ఫీజులు ఎక్కువగా ఉండటం, స్కాలర్‌షిప్పుల కోసం తల్లిదండ్రులు ఆశపడుతుండటంలాంటి విషయాలు నేరగాళ్లకు కలిసొస్తున్నాయి.

ఎక్కువగా తిరునెల్వేలిలో..

ఈ స్కామ్‌లో ఎక్కువమంది బాధితులు తిరునెల్వేలి జిల్లా నుంచి ఉన్నారని అధికారులు గుర్తించారు. డబ్బులు పోగొట్టుకుని అధికారుల దృష్టికి వచ్చినవారే 10మందికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా 5మంది ఖాతాల నుంచి డబ్బులు మాయమవగా, ఆగస్టులో మరో 5మంది ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు విత్‌డ్రా చేశారు. ఆ జిల్లాలో చాలామంది తల్లిదండ్రులకు ఈ తరహా స్కాలర్‌షిప్ కాల్స్ వచ్చినట్లుగా చెబుతున్నారు. కొందరు మాత్రం ముందే అప్రమత్తమైనట్లు వివరిస్తున్నారు.

సైబర్ హెల్ప్‌లైన్.. 1930

ఫిర్యాదు చేయాల్సిన వెబ్‌సైట్ www.cybercrime.gov.in

విద్యాశాఖ ఆదేశాలు

స్కాలర్‌షిప్పుల స్కామ్‌పై పాఠశాల విద్యాశాఖ జిల్లాల్లో ముఖ్యవిద్యాధికారులకు కీలక ఆదేశాలు చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని చెబుతోంది. ఎలాంటి పరిస్థితుల్లోనూ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండేలా అప్రమత్తం చేయాలని కోరింది. బాధితులకు అండగా నిలవాలని ఆదేశించింది. విద్యాశాఖ ఎప్పుడూ ఫోన్లలో బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకోదని, పాఠశాలలోనే తీసుకుని స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేయిస్తారని, మోసపోవద్దని హెచ్చరిస్తున్నారు.

తమిళ తల్లి ప్రార్థనా గీతంలో అపశ్రుతి

- వినిపించని 'ద్రావిడ' పదం
- గవర్నర్‌పై భగ్గుమన్న రాజకీయ పక్షాలు

చెన్నై, న్యూస్‌టుడే: గవర్నర్ ఆర్.ఎన్.రవి మరోమారు వివాదంలో చిక్కుకున్నారు. ఆయన సమక్షంలో ఆలపించిన తమిళతల్లి ప్రార్థనా గీతంలో 'ద్రావిడ' అనే పదం వచ్చే పాదాన్ని విస్మరించడం వివాదాస్పదమైంది. ఉద్దేశపూరితంగానే తొలగించి ఆలపించారని, గవర్నర్‌ను వెంటనే కేంద్ర ప్రభుత్వం రీకాల్ చేయాలంటూ రాజకీయపక్షాలు గళం విప్పాయి. నగరంలోని దూరదర్శన్ కేంద్రం తమిళ ఛానెల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన 'హిందీ మాసం' వేడుకల ముగింపు కార్యక్రమంలో గవర్నర్ సమక్షంలో తమిళ తల్లి ప్రార్థనా గీతాన్ని ఆలపించారు. అందులో 'తెక్కణముం అదిరసిరంద ద్రావిడనల్ తిరునాడుం' అనే పాదాన్ని విడిచిపెట్టడం వివాదాస్పదమైంది.

- ముఖ్యమంత్రి స్టాలిన్ తన 'ఎక్స్' పేజీలో.. గవర్నరా? ఆర్యుడా? అంటూ ప్రశ్నించారు. 'ద్రావిడ' పదాన్ని తొలగించి తమిళతల్లి ప్రార్థనా గీతాన్ని ఆలపించడం రాష్ట్ర చట్టాన్ని అతిక్రమించడమేనని తెలిపారు. చట్టప్రకారం కాకుండా ఇష్టప్రకారం వ్యవహరిస్తే గవర్నర్ పదవికి అనర్హులని పేర్కొన్నారు. హిందీ వేడుకలు చేసుకునే ముసుగులో జాతీయ సమైక్యతను, ఈ నేలపై నివసించే పలు వర్గాల ప్రజలను గవర్నర్ కించపరుస్తున్నారని విమర్శించారు. ద్రావిడ అలర్జీతో బాధపడుతున్న గవర్నర్ జాతీయ గీతంలోని ద్రావిడ పదాన్ని విడిచిపెట్టి పాడమని చెప్పగలరా అని ప్రశ్నించారు. గవర్నర్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు.


స్పందించిన గవర్నర్, డీడీ తమిళ్

ముఖ్యమంత్రి ప్రకటనకు గవర్నర్ ఆర్.ఎన్.రవి తన 'ఎక్స్' పేజీ ద్వారా స్పందించారు. అందులో.. తమిళతల్లి ప్రార్థనా గీతాన్ని అవమానించినట్టు తనపై తప్పుడు ఆరోపణ చేశారన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో తమిళ భాష ప్రచారానికి తాను పలు ప్రయత్నాలు చేశానని, ఈశాన్య రాష్ట్రాల్లో తమిళ ప్రచారానికి అసోం ప్రభుత్వ సహకారంతో గువాహటి విశ్వవిద్యాలయంలో తమిళ డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టినట్టు తెలిపారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా జాత్యహంకార అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి వినిపించడం దురదృష్టకరమని, చౌకబారని, ముఖ్యమంత్రి పదవి గౌరవాన్ని తగ్గిచేలా ఉందని పేర్కొన్నారు. గీతంలో ద్రావిడ పదం విడిచిపెట్టడంపై దూరదర్శన్ తమిళ్ ఛానెల్ క్షమాపణ కోరింది.

- టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై తన ప్రకటనలో... రాష్ట్ర గవర్నర్‌గా ఆర్.ఎన్.రవి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ తమిళనాడుకు వ్యతిరేకంగా, తమిళుల సంస్కృతి, ఆచార వ్యవహారాలకు విరుద్ధంగా, తమిళ భాషా ఔన్నత్యాన్ని తగ్గించేలా మాట్లాడుతున్నారని తెలిపారు. తమిళతల్లి ప్రార్థనా గీతంలో ఉద్దేశపూరితంగానే 'ద్రావిడ' పదం ఉన్న పాదాన్ని విడిచిపెట్టారని ఆరోపించారు. గవర్నర్ ప్రసంగంలో ఇండియా నుంచి తమిళనాడును విడగొట్టడానికి 50ఏళ్లుగా ప్రయత్నం జరుగుతోందని చెప్పడం ఖండించదగిందని పేర్కొన్నారు. తమిళులకు వ్యతిరేకమైన ఇలాంటి వ్యాఖ్యలను గవర్నర్ వెంటనే మానుకోవాలన్నారు.

కువైట్‌లో తమిళ యువకులకు చిత్రహింసలు

- భారత దౌత్య కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితులు
- ఏడుగురిని ఆదుకున్న వ్యాపారవేత్త



వ్యాపారవేత్త హద్గర్ అలీతో బాధితులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పెరంబలూర్, మదురై, కడలూర్, ధర్మపురి జిల్లాలకు చెందిన వినేష్, దీపాకరన్, రిశ్వంత్, తిరుమావళవన్, రావణన్, వెంకటేష్, అజేన్ ఓ ప్రైవేట్ కంపెనీ ద్వారా కువైట్‌కు పనికి వెళ్లారు. ఇందుకోసం వాణియంబాడికి చెందిన సబీర్‌ఖాన్ అనే ఏజెంట్ ఒక్కొక్కరి వద్ద రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు తీసుకున్నాడు. ఈ ఏడాది జులైలో కువైట్‌కు వెళ్లిన ఏడుగురికి డ్రైవర్‌గా పని ఇచ్చారు. మొదట 8 గంటలు మాత్రమే పని ఉంటుందని చెప్పి తర్వాత 18 గంటల వరకు వారితో పనిచేయించినట్లు తెలుస్తోంది. అందులో దీపాకరన్, రిశ్వంత్, తిరుమావళవన్‌కు తప్ప మిగిలిన వారందరికీ ఒక నెల వేతనం మాత్రమే ఇచ్చారు. సరిగ్గా ఆహారం, నిద్రలేక అలమటిస్తున్న ఆ ఏడుగురు యజమాని నుంచి తప్పించుకొని భారత రాయబార కార్యాలయానికి చేరుకుని తమ పరిస్థితిని వివరించారు. వారి పరిస్థితి తెలుసుకున్న వ్యాపారవేత్త హద్గర్ అలీ ఏడుగురికి సాయం అందించి తన కంపెనీలో పని కూడా ఇస్తానని చెప్పాడు. భారత రాయబార కార్యాలయంలో పనిచేస్తున్న తెన్కాశీకి చెందిన షాజహాన్ వారి స్పాన్సర్లను పిలిపించి పాస్‌పోర్ట్‌లను బాధితులకు అప్పగించారు.

ద్రోహులు మళ్లీ పార్టీలోకి రావాలనుకుంటున్నారు

- మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకేలోకి తిరిగి చేర్చుకోవాలని కొందరు ద్రోహులు వేడుకుంటున్నారని మాజీమంత్రి ఆర్బీ ఉదయకుమార్ తెలిపారు. మదురై పశ్చిమజిల్లా అన్నాడీఎంకే తరఫున పార్టీ వార్షికోత్సవంలో భాగంగా తిరుమంగళంలోని జయలలిత ఆలయంలో శుక్రవారం బహిరంగసభ జరిగింది. ఆర్బీ ఉదయకుమార్ పాల్గొని మాట్లాడుతూ.. . గత శాసనసభ ఎన్నికల్లో తిరుమంగళం, ఉసిలంబట్టి నియోజకవర్గాల్లా శ్రమించి ఉంటే డీఎంకే పాలనలోకి వచ్చేది కాదన్నారు. ఆ పార్టీ అధికారంలోకి రావడానికి అన్నాడీఎంకేకు ద్రోహం చేసినవారే కారణమని ఆరోపించారు. ఈ ద్రోహానికి తలపెట్టినవారిని ఎంజీఆర్, జయలలిత ఎప్పటికీ క్షమించబోరని చెప్పారు. వారి గురించి బాధపడాల్సిన అవసరం లేదన్నారు. 43 నియోజకవర్గాల్లో 1.92 లక్షల ఓట్ల తేడాతోనే ఓడిపోయి అధికారంలోకి రాలేకపోయామని చెప్పారు. పార్టీ నుంచి వెళ్లిపోయినవారు మళ్లీ వస్తామని ఇప్పుడు వేడుకుంటున్నారని తెలిపారు.


బంగాళాఖాతంలో మళ్లీ అల్పపీడనం?

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో 22వ తేదీ అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం శుక్రవారం తెలిపింది. అల్పపీడనం ఏర్పడిన తర్వాత అది వాయువ్య దిశగా పయనించి మరింత బలపడుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలు చోట్ల 24వ తేదీ వరకు భారీ వర్షాలు పడతాయని వివరించింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి రాష్ట్రంలో పలు జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి.

అధికారి బదిలీపై అనుమానం: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: డీఎంకే ప్రభుత్వంలో మానవహక్కుల కమిషన్ హక్కులకే భంగం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిసామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కాంచీపురానికి చెందిన విశ్రాంత మహిళా పోలీసు ఇన్‌స్పెక్టర్ మృతి కేసులో అరెస్టయిన రాజకీయ నేతను, మరో వ్యక్తిని పోలీసుస్టేషన్‌లో చిత్రహింసలకు గురి చేసినట్లు మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయన్నారు. ఇందుకు సంబంధించి నివేదిక అందించాలని కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసుకు సంబంధించి ఎన్‌కౌంటర్ ఘటనపై కూడా విచారించేందుకు మానవహక్కుల కమిషన్ ఆదేశించిందన్నారు. ఈ రెండింటిని ఒకే అధికారిని నియమించారని, ఆయన నివేదికలు కూడా సమర్పించినట్లు తెలిసిందన్నారు. అకారణంగా ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసిందని చెప్పారు. ఇది పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.

- మరుదుపాండియర్ వర్ధంతిని పురస్కరించుకుని అన్నాడీఎంకే తరఫున 24న నివాళులర్పించనున్నట్లు ఈపీఎస్ తెలిపారు. శివగంగై జిల్లా తిరుప్పత్తూరులోని స్మారక మందిరంలో నివాళులర్పిస్తారన్నారు.



కవరైపేట్టై రైలు ప్రమాదంపై ముమ్మర దర్యాప్తు

చెన్నై, న్యూస్‌టుడే: ఉలిక్కిపాటుకు గురిచేసిన కవరైపేట్టై రైలు ప్రమాదంపై రైల్వే భద్రతా కమిషనర్ నేతృత్వంలోని బృందం ముమ్మరంగా దర్యాప్తు చేస్తోంది. రెండు రోజుల్లో 30 మంది వద్ద వివరాలు ఆరా తీసింది. కవరైపేట్టైలో 11న రాత్రి గూడ్సు రైలును భాగమతి ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టిన విషయం తెలిసిందే. ప్రాణనష్టం జరగకున్నా ప్రమాద తీవ్రత ఉండటంతో ఈ ఘటన సంచలనం సృష్టించింది. ఘటనపై రైల్వే భద్రతా కమిషనర్ ఎ.ఎం.చౌదరి విచారణ చేపట్టారు. ట్రాక్, సిగ్నల్, రైల్వే స్టేషన్ ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ, కంట్రోల్ రూం తదితర సిగ్నల్, ఆపరేషన్ విభాగాలను పరిశీలించారు. భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు లోకో పైలెట్, అసిస్టెంట్ లోకో పైలెట్, టికెట్ ఎగ్జామినర్, ఏసీ కోచ్‌ల సిబ్బంది, అధికారులు, పొన్నేరి, కవరైపేట్టై రైల్వేస్టేషన్ అధికారులు, ప్రమాదం జరిగిన ప్రాంతం సిగ్నల్ ఇన్‌ఛార్జి అధికారి తదితర 13 విభాగాలకు చెందిన 30 మందిని విచారణకు హాజరు కావాలంటూ దక్షిణ రైల్వే భద్రతాశాఖ తరఫున సమన్లు పంపారు. తొలి విడతగా దక్షిణ రైల్వే ప్రధాన కార్యాలయంలోని చెన్నై డివిజనల్ కార్యాలయంలో బుధవారం 15 మందిని, రెండో రోజు మిగతా 15 మందిని విచారించారు. రైల్వే భద్రతా కమిషనర్ ఏ.ఎం.చౌదరి నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ, దక్షిణ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ అధికారి గణేశ్, చెన్నై డివిజనల్ రైల్వే మేనేజరు విశ్వనాథ్ ఈర్య, డివిజనల్ భద్రతా అధికారి బాలమురళి తదితర 10 మందికి పైగా అధికారులు విచారణలో పాల్గొన్నారు. వివరాలను రాతపూర్వకంగా నమోదు చేశారు. నివేదికను 10 నుంచి 15 రోజుల్లో రైల్వే బోర్డుకు అందించనున్నట్టు అధికారులు వెల్లడించారు.

రైల్వే పోలీసులు..

మరోవైపు రైల్వే పోలీసులూ ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఇప్పటికే రైల్వే సిబ్బంది 11 మందికి కొరుక్కుపేట రైల్వే పోలీసులు సమన్లు పంపగా వారిని సెంట్రల్ రైల్వే స్టేషన్‌లోని కార్యాలయానికి పిలిపించి రైల్వే డీఎస్పీ కర్ణన్ విచారించారు. మరో 10 మందికి విచారణ నిమిత్తం సమన్లు పంపారు.

ఎన్ఐఏ చేతికి ఫైసల్ రెహ్మాన్ డైరీ

- అనుచరుల కోసం గాలింపు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నైలో అరెస్టయిన 'హిజ్బ్ ఉద్ తహ్రీర్' ఉగ్రవాద సంస్థకు చెందిన వ్యక్తి వద్ద స్వాధీనం చేసుకున్న డైరీ ఆధారంగా అతని అనుచరుల కోసం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు గాలిస్తున్నారు. హిజ్బ్ ఉద్ తహ్రీర్ అనే ఉగ్రవాద సంస్థను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. రాష్ట్రంలో ఈ సంస్థకు మనుషులను సమకూర్చి, వారికి ఉగ్రవాద శిక్షణ ఇచ్చినందుకు చెన్నై అన్నా వర్సిటీ మాజీ గౌరవ ఆచార్యుడు హమీద్ ఉస్సేన్ తదితర ఏడుగురిని అరెస్ట్ చేశారు. గత 10వ తేదీ చెన్నై తరమణిలో ముఖ్య నిందితుడైన ఫైసల్ రెహ్మాన్‌ను అరెస్ట్ చేశారు. అతని ఇంట్లో ఎన్ఐఏ అధికారులు సోదాలు జరిపి రహస్య డైరీని స్వాధీనం చేసుకున్నారు. దీని గురించి ఎన్ఐఏ అధికారులు మాట్లాడుతూ... 'హిజ్బ్ ఉద్ తహ్రీర్' ఉగ్రవాద సంస్థకు ఫైసల్ రెహ్మాన్ మనుషులను సమకూర్చడం, సమావేశాలు నిర్వహించడంలో ముఖ్యపాత్ర పోషించాడని చెప్పారు. పాకిస్థాన్ ఆర్మీతో రహస్యంగా సంప్రదింపులు జరుపుతున్నాడని తెలిపారు. తమిళనాడు వ్యాప్తంగా పర్యటించి జిల్లాల్లో 10 మందిని సంస్థలో చేర్చాడని, వారికి ఆయుధ శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అందుకుగాను ఆధారాలు రహస్య డైరీలో ఉన్నాయని చెప్పారు. అందులోని సమాచారం ప్రకారం అతని అనుచరుల కోసం గాలిస్తున్నామని వెల్లడించారు.

ఆవిన్ పాల వ్యవహారంలో వదంతులొద్దు

టీనగర్, న్యూస్‌టుడే: ఆవిన్ సంస్థ పచ్చ రంగు పాల ప్యాకెట్ల విక్రయాన్ని తగ్గించినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఆవిన్ యంత్రాంగం ప్రకటించింది. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో.. పచ్చరంగు పాలప్యాకెట్ల విక్రయం యథావిధిగా కొనసాగుతోంది. వినియోగదారులు కోరుకునే రీతిలో విటమిన్ ఏ, డీ పోషకాలతో కూడిన కొత్త పాల ప్యాకెట్లు పరిచయం చేయాలనే విషయాన్ని పరిశీలిస్తున్నాం. వాటి విడుదల విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రజాభిప్రాయాలు సేకరించిన తర్వాతే మార్కెట్లో తెస్తామని తెలిపింది.

ఒక్కరోజు వానకే ఇళ్లలోకి నీరు: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: ఒక్కరోజు వానకే చెన్నై విలవిల్లాడిందని, వేళచ్చేరి, సేలైయూరు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరిందని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం తెలిపారు. అశోక్‌నగర్, త్యాగరాయనగర్, హస్తినాపురం, పటాలం, కొరట్టూరు, పెరుంగుడి, కొరుక్కుపేట తదితర ప్రాంతాల్లోనూ అలాంటి పరిస్థితే ఎదురైంది వార్తలు వచ్చాయన్నారు. వర్షపాతం ఇంకాస్త పెరిగి ఉంటే డీఎంకే బండారం బయటపడేదని పేర్కొన్నారు. ఈ ఏడాది చివరి వరకు ఈశాన్య రుతుపవనాలు కొనసాగుతాయని పెండింగ్‌లో ఉన్న వాననీటి కాలువల పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

- ద్రోహం..త్యాగం గురించి మాట్లాడటం చూస్తే దెయ్యం వేదాలు వల్లించినట్లు ఉందని ఓపీఎస్ మరో ప్రకటనలో తెలిపారు. జయలలిత కాలంలో 45 శాతంగా ఉన్న ఓటు బ్యాంకు నేడు 20 శాతానికి పడిపోయిందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే అన్నాడీఎంకే ఎప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. ఓటు బ్యాంకు మరింత పడిపోతుందని పేర్కొన్నారు.

కోయంబత్తూరు విచ్చేసిన ఎయిర్ మార్షల్

వడపళని, న్యూస్‌టుడే: బెంగళూరులోని 'ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ట్రెయినింగ్ కమాండ్' ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, ఎయిర్ మార్షల్ నాగేష్ కపూర్ కోయంబత్తూరు ఎయిర్ ఫోర్స్ అడ్మినిస్ట్రేటివ్ కళాశాలకు(ఏఎఫ్ఏసీ) రెండు రోజుల పర్యటనార్థం గురువారం విచ్చేశారు. ఎయిర్ కమొడోర్ వికాస్ వాహి ఆయనకు ఘన స్వాగతం పలికారు. కళాశాలలో శిక్షణకు కావాల్సిన మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయో పరిశీలించారు. మిలిటరీ విద్యలో ఏఎఫ్ఏసీ ప్రాముఖ్యతను వివరించారు. శిక్షకుల కవాతును కపూర్ తిలకించారని రక్షణ విభాగం శుక్రవారం ప్రకటనలో పేర్కొంది.



కవాతు తిలకిస్తున్న నాగేష్ కపూర్

కలెక్టరేట్‌లో గ్రంథాలయం ప్రారంభం


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అన్బిల్ మహేశ్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: దివంగత మాజీ ముఖ్యమంత్రి కలైజ్ఞర్ కరుణానిధి శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా తిరువళ్లూరు కలెక్టరేట్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. దీన్ని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ పొయ్యామొళి శుక్రవారం ప్రారంభించి సందర్శించారు. మంత్రి నాజర్, ఎంపీ శశికాంత్ సెంథిల్, ఎమ్మెల్యేలు చంద్రన్, రాజేంద్రన్, గోవిందరాజన్, కృష్ణమూర్తి, జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్, వివిధ శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నావికా దళ కార్ల ర్యాలీ...


నావల్ స్టేషను నుంచి బయల్దేరిన ర్యాలీ

వడపళని, న్యూస్‌టుడే: నావికా దళ దినోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నై నుంచి కన్నియాకుమరికి కార్ల ర్యాలీ చెన్నై నగరంలో శుక్రవారం ప్రారంభమైంది. తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాల ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్, రియర్ అడ్మిరల్ రవికుమార్ ధింగ్రా అడయార్‌లోని నావల్ స్టేషనులో ర్యాలీకి జెండా ఊపారు. తమిళనాడు, పుదుచ్చేరిలో తీరం వెంబడి 1,800 కిలోమీటర్ల వరకు ర్యాలీ సాగుతుందని రక్షణ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. మార్గంలో విద్యా సంస్థలకు విచ్చేసి, విద్యార్థులకు భారతీయ నావికా దళం గురించి అవగాహన కల్పిస్తారు. విపత్తు సమయాల్లో దేశ, విదేశాల్లో నావికా విభాగం ఎలాంటి సేవలందిస్తోందో వారికి వివరిస్తారు. ర్యాలీ కన్నియాకుమరిలోని తుక్కలేకి ఈ నెల 21వ తేదీకి చేరుకుంటుంది.

ఘన వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టు పనులు...


శుభ్రతా కార్మికుడికి వాహనం అప్పగిస్తున్న మంత్రి ఆర్.గాంధీ

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా వాలాజాపేటలో 'స్వచ్ఛ భారత్' పథకం కింద ఘన వ్యర్థాల నిర్వహణ పథకానికి సంబంధించిన ప్రాజెక్టు పనులను శుక్రవారం మంత్రి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.68.58 లక్షల విలువైన 27 ఎలక్ట్రికల్ చెత్త వాహనాలను శుభ్రతా కార్మికులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు చంద్రకళ, జిల్లా పథకాల అమలు అధికారిణి జయసుధ, వాలాజా పంచాయతీ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌జీ శేష వెంకట రమణన్, ఉపాధ్యక్షుడు రాధాకృష్ణన్, ఆర్డీవో రాజరాజన్, బీడీవోలు పాల్గొన్నారు.

వల్లకోట మురుగన్ ఆలయ హుండీల లెక్కింపు

శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే: శ్రీపెరుంబుదూర్ సమీప వల్లకోటలోని ప్రసిద్ధ మురుగన్ ఆలయం దేవాదాయశాఖ పరిరక్షణలో ఉంది. ఈ ఆలయంలో 3 నెలలకోసారి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తారు. ఆ మేరకు రెండు రోజులుగా ఆలయంలో ఉన్న 10 హుండీలను ఆలయ ఇన్‌స్పెక్టరు తిలకవతి, ఈవో సెంథిల్ కుమార్ నేతృత్వంలో సిబ్బంది, వాలంటీర్లు లెక్కించారు. రూ.17 లక్షల నగదు, 54 గ్రాముల బంగారం, 1,400 గ్రాముల వెండి ఆదాయంగా లభించినట్లు ఈవో తెలిపారు.

24 గంటల నీటి సరఫరాకు కసరత్తు



తిరువాన్మియూరు, పళ్లిపట్టు ప్రాంతాలకు లబ్ధి

న్యూస్‌టుడే, వడపళని

తిరువాన్మియూరు, పళ్లిపట్టు ప్రాంతాల్లోని గృహాలకు విద్యుత్తు ఛార్జీలు చెల్లిస్తున్న పద్ధతిలో 24×7 తాగునీటి సరఫరాకు మెట్రో వాటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది. ఈ రెండు ప్రాంతాల్లోని 40 వేల గృహాలకు త్వరలోనే నీరు సరఫరా అవుతుందని అధికారులంటున్నారు. విద్యుత్తు వాడకానికి బిల్లు ఎలా చెల్లిస్తున్నామో అలాగే నీటి పంపిణీకి చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం మెట్రో వాటర్ విభాగం ఈ ప్రాంతాలకు రోజుకు గంటపాటు మాత్రమే నీటిని సరఫరా చేస్తోంది. రోజుకు 40 మిలియన్ లీటర్ల 24 గంటలు మీటర్లతో పైపుల ద్వారా అందించనుంది. అడయార్, కోడంబాక్కం జోన్లలో మాదిరిగా తిరువాన్మియూరు, పళ్లిపట్టు ప్రాంతాల్లో కూడా 24×7 నీటి సరఫరాపై సమగ్ర నివేదిక కూడా తయారు చేస్తోంది. 2023 జులైలో మెట్రోవాటర్, వాటర్ కార్పొరేషన్ ఆఫ్ ఒడిశా (వాట్కో) సంస్థలు రూ.1,958.25 కోట్ల వ్యయంతో నీటి సరఫరా ప్రాజెక్టు కోసం ఒప్పందాలు కూడా చేసుకున్నాయి. ఇళ్లలో ఉండే సంపులు, ట్యాంకుల్లోకి నీరు నింపుకునేదానికి బదులు భూగర్భ పైపులైన్ల ద్వారా నీరు పట్టుకోవచ్చు.

ఫలితాలపై అధ్యయనం

ప్రస్తుతానికి ఈ ప్రాంతాల వారికి ఐటీ ప్రాంగణంలో ఉన్న పంపిణీ స్టేషను నుంచి 40 ఎంఎల్‌డీ నీటిని అందించనున్నారు. తమ విభాగం చేపట్టనున్న ఈ ప్రాజెక్టుతో కనిపించే ఫలితాలను అధ్యయనం చేసి ఇతర ప్రాంతాలకు విస్తరించాలనుకుంటున్నామని అధికారి ఒకరన్నారు. సమగ్ర నివేదికపై తుది నిర్ణయం తీసుకోనున్నట్టు చెప్పారు. నీటి సరఫరాకు 370 కిలోమీటర్ల పొడవుతో పైపులైన్ల నెట్‌వర్క్ ఉంటుందని, 37 కి.మీ మేర పాత వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, కొన్ని చోట్ల మరమ్మతులుంటాయని పేర్కొన్నారు. 'సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డాటా అక్విజిషన్' (ఎస్‌సీఏడీఏ) సిస్టమ్ ఆధ్వర్యంలో నిర్వహణ, పైపులైన్లలో ఉన్న వాల్వుల్లో నీటి ప్రవాహ ఉద్ధృతి గమనిస్తుంటారు. గత ఏడాది వలసరవాక్కం జోన్‌లోని 149, 152 వార్డులలో రూ.69.64 కోట్లతో ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టుతో తిరువాన్మియూరు, పళ్లిపట్టులో 24×7 నీటి సరఫరా అందుతోంది. కొంత భాగంలో అక్కడక్కడా లీకేజీ సమస్యలుండటంతో సరిచేస్తున్నారు. అయినా కొన్ని గృహాలకు రోజుకు 22 లక్షల నీరు 24 గంటలపాటు అందుతోందని మెట్రో వాటర్ విభాగ ఉన్నతాధికారి ఒకరన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కాంచీపురం, న్యూస్‌టుడే: ఓరిగై విద్యుత్తు ఉపకేంద్రంలో శనివారం మాసాంతర అత్యవసర మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓరిగై, ఓరిగై పారిశ్రామికవాడ, వాటర్ పంపింగ్ స్టేషన్, కలెక్టరు కార్యాలయ ప్రాంగణం, కామరాజర్ వీధి, వళ్లల్ పచ్చయప్పన్ వీధి, మేట్టు వీధి, పట్టణ పరిసరాలైన తిరుక్కాళి మేడు, పల్లవర్ మేడు, చిన్న కాంచీపురం, పెరియార్‌నగర్ తదితర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు అధికారులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు తాలూకా అత్తిమాంజేరిపేట, కొళత్తూర్, బొమ్మరాజుపేట, ఆర్‌కేపేట తాలూకాలో వి.పుదూర్, బాలాపురం తదితర విద్యుత్ సబ్‌స్టేషన్లలో శనివారం నెలవారీ మరమ్మతుల కారణంగా అత్తిమాంజేరిపేట, కర్లంబాక్కం, పెరుమానల్లూర్, నొచ్చిలి, కోనసముద్రం, పళ్లిపట్టు, సొనాకుప్పం, నెడియం, కొళత్తూర్, పున్నం, సొరకాయపేట, కాక్కలూర్, పాండ్రవేడు, మేళపూడి, కొండాపురం, ఆర్‌కేపేట, చల్లాత్తూర్, కృష్ణాకుప్పం, అమ్మయార్‌కుప్పం దక్షిణ ప్రాంతం, కథన నగరం, జనకరాజుకుప్పం, ఆర్‌ఎంకుప్పం, బాలాపురం, వీరమంగళం దాని పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు సరఫరా ఉండదు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించాలి: టీఎన్‌టీజే


తిరుమావళవన్‌కు గ్రంథాన్ని అందిస్తున్న దావూద్ కైసర్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తమిళనాడు తౌహీత్ జమాత్ (టీఎన్‌టీజే) ప్రధాన కార్యాలయం చెన్నై అశోక్‌నగర్‌లో ఉంది. వీసీకే అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్ శుక్రవారం ఈ కార్యాలయానికి విచ్చేశారు. టీఎన్‌టీజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు దావూద్ కైసర్, ఉప ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌రహీం, కార్యదర్శి సిద్దిక్ తిరుమావళవన్‌ను ఆహ్వానించి సత్కరించారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీలోని ఇండియా కూటమి సభ్యులు బిల్లును వ్యతిరేకించాలని దావూద్ కైసర్ తిరుమాను కోరారు. ముందుగా మహ్మద్‌ప్రవక్త జీవిత విశేషాలకు సంబంధించిన గ్రంథాన్ని ఆయనకు అందజేశారు.

విద్యుదుత్పత్తిపై కోవై కార్పొరేషన్ దృష్టి


నీటిపై అమర్చిన సౌర పలకలు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మొట్టమొదటిగా కోయంబత్తూరులో నీటిపై తేలియాడే సౌర పలకల ద్వారా విద్యుదుత్పత్తి చేసి అధికారులు ఘనత సాధించారు. కోవై కార్పొరేషన్ టీఎన్‌ఈబీకి 2 నెలలకోసారి రూ.కోట్లలో విద్యుత్తు బిల్లు చెల్లిస్తోంది. ఖర్చు తగ్గించుకునేందుకు నిర్ణయించిన కార్పొరేషన్ అధికారులు నమక్కునామే పథకం కింద జర్మనీకి చెందిన ఓ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు రూ.1.45 కోట్లతో సౌర విద్యుత్తు పలకలను కొనుగోలు చేశారు. కోవై ఉక్కడం లోని చెరువులో అర ఎకరా విస్తీర్ణంలో పలకలను నీటిపై తేలియాడే విధంగా అమర్చారు. దీని ద్వారా 154 కిలోవాట్ల ఉత్పత్తి చేయవచ్చని అధికారులు తెలిపారు. దీన్ని శుక్రవారం ప్రయోగాత్మకంగా పరీక్షించి విజయం సాధించారు. మరో 2 నెలల్లో పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రజల నిజమైన అభివృద్ధిపై భాజపాకు అక్కరలేదు: సెల్వ పెరుంతగై

చెన్నై, న్యూస్‌టుడే: ప్రజల నిజమైన అభివృద్ధిపై భాజపాకు అక్కరలేదని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై తెలిపారు. ఆయన తన ప్రకటనలో... 2014, 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో... 2024లోపు భారతదేశ ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ డాలర్లుగా పెంచడంతో పాటు, దేశ స్థూల అభివృద్ధి శాతాన్ని రెండింతలుగా మార్చునున్నట్టు ప్రధాని మోదీ వాగ్దానం చేశారన్నారు. పదేళ్ల పాలనలో ఈ అభివృద్ధిని సాధించలేదన్నారు. ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో భారతదేశ ఆర్థిక వ్యవస్థ 5వ స్థానంలో ఉందని, దానిని మూడో స్థానానికి తీసుకురానున్నట్టు మోదీ చెబుతున్నారని తెలిపారు. మోదీ పాలనలో ప్రజా జీవనాధారం దారిద్ర్య కోరల్లో చిక్కుకుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఐక్యరాజ్య సమితి నివేదికకు భాజపావారు ఏం సమాధానమిస్తారని ప్రశ్నించారు. ప్రజల నిజమైన అభివృద్ధిపై భాజపావారికి శ్రద్ధ లేదని ఐక్యరాజ్య సమితి గణాంకాలు వెల్లడిస్తున్నాయని తెలిపారు.

25, 26 తేదీల్లో మహిళా బృందాల ఉత్పత్తులతో ప్రత్యేక బజారు


నుంగంబాక్కంలోని అన్నై థెరెస్సా మహిళా ప్రాంగణం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: చెన్నై నుంగంబాక్కంలో మహిళా స్వయం సహాయక బృందాల తరపున 2 రోజులపాటు మహిళా బృందాలు తయారు చేసిన ఉత్పత్తులతో దీపావళి ప్రత్యేక బజారును ఏర్పాటు చేస్తున్నట్లు మహిళాభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నుంగంబాక్కంలోని అన్నై థెరెస్సా (మదర్ థెరెస్సా) మహిళా ప్రాంగణంలో ప్రతి నెలా 3వ వారం శని, ఆదివారాల్లో సహజ సిద్ధమైన వస్తువులతో ప్రత్యేక బజారును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ మేరకు ఈనెల 3వ వారం దీపావళి పండుగను పురస్కరించుకొని 25, 26 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో కాంచీపురం పట్టు చీరలు, దిండుక్కల్, చిన్నాలంపట్టు, మదురై చీరలు, విరుదునగర్, అరియలూర్ కాటన్ చీరలు, కోవై నెగమమం చీరలు, నామక్కల్ దోవతులు, చొక్కాలు, తిరుప్పూర్ టీషర్టులు, తిరునెల్వేలి, తెన్‌కాశీల్లో ఉత్పత్తి చేసిన నైటీలు, ఈరోడ్‌లో ఉత్పత్తి చేసిన బెడ్ షీట్లు మొదలైన వస్త్ర రకాలు విక్రయానికి ఉంచుతామని వివరించారు. అదేవిధంగా సంప్రదాయ వరి వంగడాలతో తయారు చేసిన రకరకాల వంటలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, మొదలైన వాటిని విక్రయానికి ఉంచుతారని తెలిపారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు.

జీవన్మృతుడి అవయవాల దానం


తమిళ్‌వాణన్ (పాతచిత్రం)

వేలూర్, అరక్కోణం, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై జిల్లా మేల్‌ముడియనూరు పెరుమాల్ ఆలయ వీధికి చెందిన శివకుమార్ రైతు. ఇతనికి భార్య కర్పగం, ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు తమిళ్‌వాణన్ (20) శ్రీపెరంబుదూరులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇతను ఈనెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు రాణిపేటలోని సీఎంసీ ఆసుపత్రిలో చేర్చగా గురువారం రాత్రి జీవన్మృతి చెందాడు. అతని అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు ముందుకొచ్చారు. ఆ మేరకు అతని గుండెను సీఎంసీ ఆస్పత్రికి, కిడ్నీని చెన్నైలోని అపోలో ఆస్పత్రికి శుక్రవారం అందించారు.

మానవహక్కుల కమిషన్‌లో సీపీ క్షమాపణ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌లో క్షమాపణ కోరుతూ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ తరపున పిటిషన్ దాఖలైంది. కమిషనర్‌గా జులై 8న బాధ్యతలు అందుకున్న సమయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రౌడీలకు అర్థమయ్యే భాషలో పాఠం నేర్పుతానని హెచ్చరించారు. అనంతరం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు హత్య కేసులో అరెస్టైన రౌడీ తిరువెంకటం ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. రౌడీలు కాక్కా తోప్పు బాలాజీ, సీసింగ్ రాజా కూడా ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సహాయ కమిషనర్ ఇళంగోవన్, ఇతర అధికారులు రౌడీల ఇళ్లకు వెళ్లి హెచ్చరించారు. ఈ ఘటనలపై రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సుమోటోగా ఇళంగోవన్, పోలీసులపై కేసు నమోదు చేసింది. అక్టోబరు 14న హాజరవ్వాలని కమిషనర్ అరుణ్‌కు సమన్లు పంపింది. న్యాయమూర్తి మణికుమార్ ఎదుట అరుణ్ తరపున అదనపు అడ్వకేట్ జనరల్ రవీంద్రన్ హాజరయ్యారు. గురువారం కేసు విచారణకు వచ్చింది. అరుణ్ తరపున సీనియర్ న్యాయవాది విల్సన్ హాజరై కమిషనర్ మాటలకు క్షమాపణ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు.

రావణుడిని అవమానిస్తే సహించం: సీమాన్

చెన్నై, న్యూస్‌టుడే: రావణుడిని అవమానించడాన్ని సహించమని నామ్ తమిళర్ కట్చి చీఫ్ కన్వీనర్ సీమాన్ తెలిపారు. ఆయన తన ప్రకటనలో.. ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్బోర్న్ నగరాల్లో 27న 'రావణ వధ' పేరిట కార్యక్రమం ఏర్పాటు చేయడం ఖండించదగిందన్నారు. తమిళుల పూర్వీకుడు రావణుడని, ప్రపంచంలో ఆయన్ను ఎక్కడ అవమానించినా అది తమిళులందరికీ వర్తిస్తుందని పేర్కొన్నారు. తమిళజాతి దానిని చోద్యం చూడదని హెచ్చరించారు. నామ్ తమిళర్ కట్చి తన సాంస్కృతిక విభాగం వీరతమిళర్ మున్నని ద్వారా ప్రపంచవ్యాప్తంగా తమిళులు నివసించే ప్రాంతాల్లో రావణ మహోత్సవాన్ని త్వరలో నిర్వహించనుందని తెలిపారు. ఆస్ట్రేలియాలోని తమిళులు ఏకతాటిపైకి వచ్చి రావణ వధ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని కోరారు.

ట్రాక్టరు మోటార్ల ద్వారా వాననీటి తొలగింపు

చెన్నై, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీవర్షాలకు మహానగర చెన్నై కార్పొరేషన్ ప్రాంతాల్లో నిలిచిన నీటిని ట్రాక్టరు మోటార్ల ద్వారా తొలగించినట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు. వాననీటి, మురుగునీటి కాలువల్లో పూడిక తీసి మోటార్ల ద్వారా తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు 243 ప్రాంతాల్లో ట్రాక్టరు మోటార్లు ఉపయోగించామన్నారు. మరో రెండు నెలలు వరకు ఈ పనులు కొనసాగుతాయని, ఇందుకోసం పలు జిల్లాల నుంచి కాంట్రాక్టు ప్రాతిపదికన సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. రోడ్డు వెంబడి నిలిచిన వాననీటి తొలగింపునకు లారీలు వాడుతున్నామని, ఈ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని వెల్లడించారు.

వర్షాలు ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం: శశికళ

సైదాపేట, న్యూస్‌టుడే: వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడంలో డీఎంకే ప్రభుత్వం దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళ ఆరోపించారు. చెన్నై పులియంతోప్పు, పటాలం ప్రాంతంలో వర్ష బాధితులకు ఆమె గురువారం సాయం అందజేశారు. ఈ సందర్భంగా శశికళ విలేకర్లతో మాట్లాడుతూ... ఒక్క రోజు వర్షానికే నివాసాల్లోకి నీరు ప్రవేశించిందని, కాలువలు, నదీ ముఖద్వారాల వద్ద పూడిక తీసుంటే ఇలా జరిగుండేది కాదన్నారు. రోడ్డు వెంబడి దుకాణంలో ముఖ్యమంత్రి టీ తాగడం వలనో, మైకు పట్టుకుని మాట్లాడటం వలనో ఏమీ మారదన్నారు. 98 శాతం వాననీటి కాలువల పనులు పూర్తయినట్లు మంత్రి తెలిపారని, అలాంటప్పుడు ఎలా నీరు నిలబడిందని ప్రశ్నించారు. ప్రజలు ఇదంతా చూస్తున్నారని, ఏం చేయాలో వారికి తెలుసని పేర్కొన్నారు.

ఉదయనిధి స్టాలిన్‌ను చొక్కా ధరించమనండి

హైకోర్టులో పిటిషన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేటప్పుడు ఫార్మల్ డ్రెస్ కోడ్ పాటించేలా ఆదేశించాలని మద్రాసు హైకోర్టులో సత్యకుమార్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. అందులో.. 2019 జూన్ 1న డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు నెం.67 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులందరూ తప్పనిసరిగా నీట్, క్లీన్, ఫార్మల్ దుస్తులు ధరించాలని చెబుతోంది. మంత్రి ఉదయనిధి స్టాలిన్ అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో టీషర్ట్ ధరించి వస్తున్నారు. తమిళనాడు సచివాలయం నిర్దేశించిన డ్రెస్‌కోడ్‌ను పాటించడం లేదు. టీషర్ట్‌పై డీఎంకే గుర్తు ఉంటుందని, ప్రజాసేవకుడైన ఆయన ప్రభుత్వ కార్యక్రమాలలో అలాంటి దుస్తులు ధరించి రావడాన్ని నిషేధించారని పేర్కొన్నారు.


డిమాండ్ల సాధనకు శుక్రవారం మూర్ మార్కెట్ కాంప్లెక్స్ (ఎంఎంసీ) వద్ద ఆందోళన చేస్తున్న ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ) సభ్యులు - న్యూస్‌టుడే, వడపళని

31 పేద జంటలకు ఉచిత వివాహాలు 21న


జంటలకు నూతన వస్త్రాలు అందజేస్తున్న మంత్రి శేఖర్‌బాబు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ఈనెల 21వ తేదీ తిరువాన్మియూర్ మరుదీశ్వరాలయంలో 31 పేద జంటలకు దేవాదాయశాఖ తరఫున ఉచితంగా వివాహాలు జరుగనున్నట్లు మంత్రి శేఖర్‌బాబు తెలిపారు. చెన్నై నుంగంబాక్కంలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం చెన్నై జోన్ ఆలయాల తరఫున నిర్వహించనున్న వివాహాలకు సంబంధించి పెళ్లి చేసుకోనున్న జంటలకు నూతన వస్త్రాలు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్గొన్న మంత్రి శేఖర్‌బాబు చీరలు, దోవతులను అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ద్రావిడ మోడల్ డీఎంకే ప్రభుత్వంలో సిద్ధులకు ఉత్సవాలు జరిపామని తెలిపారు. చెన్నై నగరంలో ఇటీవల కురిసిన వర్షాలను ఎదుర్కోవడం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి పెను సవాలుగా మారందన్నారు. వాటన్నింటిని అధిగమించడంతో ప్రజలు ఆయన్ను అభినందిస్తున్నారని పేర్కొన్నారు. ఉదయనిధే కాకుండా అన్ని శాఖల మంత్రులు, అధికారులు సమష్టిగా పనిచేశారని, ఇది తెలియని ఎడప్పాడి పళనిసామి ఇంట్లో నుంచి కాలు బయట పెట్టకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 11 ఆలయాల్లో పూర్తి సమయం అన్నదాన పథకం అమలవుతోందని, అదేవిధంగా మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో భక్తులకు ఉచితంగా లడ్డూలు అందజేసే పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల తరపున 700 పేద జంటలకు ఉచితంగా వివాహాలు జరపనున్నట్లు వివరించారు. కడలూర్ జిల్లా వడలూర్‌లో వళ్లలార్ అంతర్జాతీయ కేంద్రాన్ని తప్పనిసరిగా నెలకొల్పుతామని పేర్కొన్నారు.

యజమానిపై విశ్వాసం చూపిన పిల్లి

నాగుపాము ఇంట్లోకి రాకుండా అడ్డగింత


నాగుపామును అడ్డుకుంటున్న పిల్లి

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా తాంబరం సమీప నెడుంగుండ్రం ఎన్‌జీవో నగర్‌కు చెందిన ఫెల్విన్ ఇంట్లో 'లియో' అనే పేరుతో పిల్లిని పెంచుతున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు గురువారం సాయంత్రం ఇంటి ప్రాంగణంలోని చెట్ల మధ్యలో బుసలు కొడుతున్న నాగుపామును పిల్లి గుర్తించింది. దానిని ఎటూ కదలనీయకుండా అడ్డుకోసాగింది. అది చూసిన ఫెల్విన్ వెంటనే పాములు పట్టేవారికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చేవరకు పాము ఇంట్లోకి ప్రవేశించకుండా పిల్లి కాపలా కాసింది. తరువాత వచ్చిన పాములు పట్టే వ్యక్తి నాగును పట్టుకుని అటవీ శాఖ సిబ్బందికి అప్పగించాడు. యజమానిపై పెంపుడు పిల్లి చూపించిన విశ్వాసాన్ని చూసిన స్థానికులు నివ్వెరపోయారు.

పరువునష్టం కేసులో కోర్టుకు హాజరైన సీమాన్


కోర్టుకు వస్తున్న సీమాన్

వేళచ్చేరి: విళుపురం జిల్లా కంజనూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెమూర్ గ్రామంలో ఎన్‌టీకే తరపున నిర్వహించిన బహిరంగసభలో పార్టీ ప్రధాన సమన్వయకర్త సీమాన్ దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని కించపరిచేలా మాట్లాడారని విళుపురం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు విక్రవాండి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం విచారణకు రావడంతో సీమాన్ హాజరయ్యారు. న్యాయమూర్తి సత్యనారాయణన్ విచారణ నవంబరుకు వాయిదా వేశారు.

ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాం : బుస్సీ ఆనంద్

సేలం: రాజకీయాల్లో తమ పార్టీ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని తమిళగ వెట్రి కళగం ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ పేర్కొన్నారు. పార్టీ మహానాడు 27న జరగనున్న నేపథ్యంలో సమీక్షా సమావేశం శుక్రవారం జిల్లాలోని ఆత్తూరులో జరిగింది. ఆయన మాట్లాడుతూ కొత్తగా ప్రారంభమైన తమ పార్టీకి రాజకీయాలు తెలుసా అని కొందరు ప్రశ్నిస్తున్నారన్నారు. తమ పార్టీ ఇతరులకు ఆదర్శంగా నిలిచే రీతిలో రాజకీయాలు చేస్తుందన్నారు.

కదులుతున్న రైల్లో ఊడిపడిన అప్పర్ బెర్త్

- బాలుడికి గాయాలు
- వివరణ ఇచ్చిన మదురై రైల్వే జోన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నాగర్‌కోవిల్- కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో 16న అప్పర్ బెర్త్ అకస్మాత్తుగా ఊడిపడటంతో నాలుగేళ్ల బాలుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి మదురై రైల్వే జోన్ విడుదల చేసిన ప్రకటనలో.. వాంజి మణియాచ్చి నుంచి కోయంబత్తూర్‌కు వెళ్తున్నప్పుడు ఈ ఘటన జరిగింది. వాంజి మణియాచ్చిలో బాధిత కుటుంబీకులు రైలు ఎక్కిన ఐదు నిమిషాల్లో లింక్ చైన్ సరిగా అమర్చకపోవడంతో నాలుగేళ్ల బాలుడిపై అప్పర్‌బెర్త్ ఊడిపడింది. టీసీ ఇచ్చిన సమాచారం మేరకు కోవిల్పట్టి రైల్వేస్టేషన్‌లో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం కోవిల్పట్టి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో బెయిల్ పిటిషన్

పోలీసుశాఖ బదులివ్వాలని కోర్టు ఆదేశం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అరెస్టైన ముగ్గురు బెయిల్ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌కు పోలీసుశాఖ బదులివ్వాలని చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఆదేశించింది. ఆర్మ్‌స్ట్రాంగ్‌ను జులైన 5న చెన్నై పెరంబలూర్‌లో దుండగులు నరికి చంపారు. రౌడీ ఆర్కాడు సురేష్ సోదరుడు పొన్నై బాలు, రౌడీ నాగేంద్రన్, అతని కుమారుడు అశ్వత్తామ తదితర 28మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటి వరకు 5 వేల పేజీలతో కూడిన అభియోగపత్రాన్ని ఎగ్మూర్ ఆర్బిట్రేషన్ కోర్టులో పోలీసులు దాఖలు చేశారు. అరెస్టైన కోడంబాక్కానికి చెందిన విఘ్నేష్‌కుమార్, విజయకుమార్, తిరువళ్లూర్‌కు చెందిన సతీష్‌కుమార్ బెయిల్ ఇవ్వాలని చెన్నై ప్రిన్సిపల్ సెషన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ న్యాయమూర్తి కార్తికేయన్ ఎదుట విచారణకు వచ్చింది. పోలీసులు వివరణ ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు.

దుబాయ్‌లో తిరుప్పత్తూర్‌వాసి మృతి

స్వస్థలానికి తీసుకురావాలని కుటుంబీకుల వినతి


సూర్య (పాతచిత్రం)

వేలూర్, న్యూస్‌టుడే: తిరుప్పత్తూర్ జిల్లా నాట్రాంపల్లికి చెందిన సూర్య (20) ఉద్యోగం నిమిత్తం ఇటీవల దుబాయ్ వెళ్లాడు. అక్కడ ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. మూడు రోజుల్లోనే ఆరోగ్యం పాడవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. విషయం తెలుసుకున్న అతని కుటుంబీకులు మరణంపై అనుమానం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేపట్టి సూర్య మరణించిన విషయాన్ని ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో అతని మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావాలంటూ కుటుంబీకులు కోరగా ఆ మేరకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది.

వేలూర్‌లో రూ.500 కోట్లతో రింగ్ రోడ్డు

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్‌లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు రూ.500 కోట్ల వ్యయంతో రింగ్ రోడ్డు నిర్మించనున్నట్లు ఎంపీ కదిర్ ఆనంద్ వెల్లడించారు. ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు సంబంధించి సదరుశాఖ ఉన్నతాధికారుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షత వహించారు. కదిర్ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కాట్పాడి, వేలూర్, కంటోన్మెంట్, గుడియాత్తంతో పాటు 20 ప్రాంతాల్లోని రైల్వే లెవెల్ క్రాసింగ్‌లు వద్ద పైవంతెనలు నిర్మించనున్నట్లు ప్రకటించారు. చెన్నై నుంచి వేలూర్‌కు జాతీయ రహదారిలో నూతనంగా సర్వీసు రోడ్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం సర్వీస్ రోడ్లలోని మురుగునీటి కాలువలపై 1500 కాంక్రీట్ స్లాబ్‌లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కదిర్‌ఆనంద్





▸ దీప పూజలో పాల్గొన్న మహిళలు ▸ కూరగాయలు, పండ్లతో అమ్మవారి సన్నిధి అలంకరణ

వైభవంగా దీపపూజ

శ్రీపెరుంబుదూరు, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లా కుండ్రత్తూర్ సమీప మాంగాడులోని ప్రసిద్ధ కామాక్షి అమ్మవారి ఆలయంలో పెరటాసి మాసం పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో 108 దీపాల పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిని విద్యుత్తు దీపాలు, సుమారు ఒకటిన్నర టన్నుల కూరగాయలు, పలు రకాల పండ్లు, మిఠాయిలతో సుందరంగా అలంకరించారు. దీప పూజలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



పూజలో పాల్గొన్న భక్తులు

సాయిబాబాకు పున్నమి పూజ

ఊత్తుకోట, న్యూస్‌టుడే: ఊత్తుకోటలోని రెడ్డి వీధిలో ఉన్న శిర్డీ సాయిబాబా మందిరంలో పున్నమి, ఐప్పసి మాసం ప్రారంభం సందర్భంగా శుక్రవారం క్షేత్రంలో ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. సాయిబాబా మహిమలు వివరించే గాత్ర కచేరి, భజన జరిగాయి. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.



విలేకర్లతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి

'భాజపా రాష్ట్ర అధ్యక్షుడిలా గవర్నర్'

సైదాపేట: ద్రావిడం అనేది కేవలం ఒక పదం కాదని, తమిళనాడును దాటి పొరుగు రాష్ట్రాల్లో నివసించే తమిళులను సూచించేదని కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి తెలిపారు. కరూరు జిల్లా ఉమ్మడి అభివృద్ధి పథకాలపై కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. తర్వాత విలేకర్లతో మాట్లాడుతూ... తమిళనాడు గవర్నర్ పాల్గొన్న కార్యక్రమంలో ద్రావిడం అనే పదాన్ని తొలగించి తమిళ తల్లిగీతం ఆలపించడాన్ని ఖండించారు. హిందీని బలవంతంగా రుద్దటాన్ని మాత్రమే తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని, హిందీ భాషను కాదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తమిళనాడు గవర్నర్, కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అర్థం చేసుకోవాలని తెలిపారు. గవర్నర్ భాజపా రాష్ట్ర అధ్యక్షుడిలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవటం లేదని విమర్శించారు.

తిరువణ్ణామలై చేరుకున్న ఉప ముఖ్యమంత్రి

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవాలు జరుగనున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి జరగనున్న అధికారుల సమావేశంలో పాల్గొనడానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తిరువణ్ణామలైకు సాయంత్రం విచ్చేశారు. ఆయనకు మంత్రి ఏవీ వేలు, జిల్లా క్రీడల సలహాదారుడు ఏవీ కంబన్ స్వాగతం పలికారు.



ఉదయనిధిని సత్కరిస్తున్న మంత్రి ఏవీ వేలు



చెన్నై నందనంలోని ఆవిన్ సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమావేశమైన రాష్ట్ర పాడిపరిశ్రమలు, ఖద్దరు శాఖ మంత్రి రాజకన్నప్పన్ - టీనగర్, న్యూస్‌టుడే



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి దురైమురుగన్

గనులశాఖపై మంత్రి సమీక్ష

సైదాపేట: గనులశాఖ అధికారుల పనితీరుపై సమీక్ష శుక్రవారం సచివాలయంలో మంత్రి దురైమురుగన్ అధ్యక్షతన జరిగింది. ఇందులో సహజ వనరులశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ఫణీంద్రరెడ్డి, ఖనిజ వనరుల శాఖ కమిషనర్ శరవణన్ వేల్‌రాజ్, శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, సహాయ డైరెక్టర్లు, ఉప డైరెక్టర్లు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లింగ్ ముఠా పట్టివేత

పటమట, న్యూస్‌టుడే: పోలీసుల కంట పడకుండా నర్సీపట్నం నుంచి విజయవాడ మీదుగా చెన్నైకి పలుమార్లు గంజాయి తీసుకెళ్తున్న ముఠాని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. వివరాలను శుక్రవారం విజయవాడ పటమట పోలీస్ స్టేషన్‌లో డీసీపీ మహేశ్వరరాజు, సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిషోర్ మీడియాకు వెల్లడించారు. చెన్నై పద్మనాభనగర్‌కు చెందిన రమేష్ వినేష్ కుమార్‌కు అదే నగరానికి చెందిన గంజాయి వ్యాపారి శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన గంజాయి వ్యాపారి దుర్గా నుంచి శ్రీనివాస్ సరకు తెప్పించి చెన్నైలో విక్రయిస్తుంటాడు. తుని నుంచి చెన్నైకి గంజాయి తీసుకెళ్తే... వినేష్‌కు రూ.25 వేలు ఇచ్చేలా ఇద్దరూ ఒప్పందం చేసుకున్నారు. దుర్గా నర్సీపట్నంలో వినేష్ వాహనంలో సరకు ఎక్కించేవాడు. అలా పలుమార్లు గంజాయి తీసుకెళ్లాడు. గతేడాది పోలీసులకు దొరికాడు. దుర్గాతో పాటు వినేష్ జైలు శిక్ష అనుభవించాడు.

నెంబర్ ప్లేట్లు మార్చి.. కిరాయి డ్రైవర్‌గా గంజాయి చేరవేసే కంటే తానే స్మగ్లింగ్ చేస్తే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే ఆలోచనతో వినేష్ కారు కొన్నాడు. పలుమార్లు గంజాయి చెన్నైకి తీసుకెళ్లాడు. ఈ నెల 16న తమిళనాడుకు చెందిన కుమారన్ మారిముత్తుతో కలిసి వినేష్ చెన్నై నుంచి కారులో తుని వచ్చాడు. గురువారం దుర్గా తీసుకువచ్చిన 150 కిలోల గంజాయిని తన కారులో లోడ్ చేసుకున్నాడు. కారుకు ఏపీ నెంబర్ ప్లేట్ అతికించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు విజయవాడలో వాహనాన్ని పట్టుకొని సరకుతో పాటు లోడ్ చేసిన తుపాకీ స్వాధీనం చేసుకున్నారు.







▸ గుమ్మిడిపూండి: భోజనం వడ్డిస్తున్న ఎస్పీ శ్రీనివాసపెరుమాల్ ▸ గుమ్మిడిపూండి: సాయం అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరాజన్ ▸ తిరుత్తణి: డీఎంకే జిల్లా కార్యదర్శి ఎస్.చంద్రన్

నిర్వాసితులకు సాయం పంపిణీ

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గుమ్మిడిపూండి, ఊత్తుకోట, పొన్నేరి, రెడ్‌హిల్స్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతవాసులను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. గుమ్మిడిపూండి సమీప కవరప్పేటలోని పునరావాస కేంద్రంలోని నిర్వాసితులను జిల్లా ఎస్పీ శ్రీనివాసపెరుమాల్ శుక్రవారం పరామర్శించి ఆహారం అందజేశారు. అదేవిధంగా పాలవాక్కంలోని కేంద్రంలో ఉన్న బాధితులకు ఎమ్మెల్యే గోవిందరాజన్ సాయం పంపిణీ చేశారు. **తిరుత్తణి:** డీఎంకే తిరువళ్లూర్ జిల్లా దక్షిణ విభాగం తరఫున వరద బాధితులకు సాయం పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. డీఎంకే తిరుత్తణి విభాగ నిర్వాహకుడు కిరణ్ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాల్లోని బాధితులకు సాయం అందజేశారు. జిల్లా కార్యదర్శి ఎస్ చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: రెడ్‌హిల్స్ పరసర ప్రాంతాల్లో 3 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు తీర్థకరియంపట్టు, విళాంగాడుపాక్కం, పాడియనల్లూరు ప్రాంతాల్లో నడుముల లోతు వాననీరు నిలిచింది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ శుక్రవారం పర్యటించారు. భారీ మోటార్లతో నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు.



వాననీరు తొలగింపు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభుశంకర్

సామాజిక కార్యకర్త ఇళంగోకు పదేళ్ల తర్వాత కేసు నుంచి విముక్తి



కోర్టు బయట ఇళంగో, ఆయన మద్దతుదారులు

సైదాపేట, న్యూస్‌టుడే: పదేళ్లు, 140 వాయిదాల తర్వాత ఓ సామాజిక కార్యకర్తకు ఓ కేసు నుంచి విముక్తి లభించింది. 2012లో అన్నాడీఎంకే పాలనలో 'నూరేళ్ల మాట్లాడుకునే ఒక ఏడాది పాలన' అనే శీర్షికతో వార్తాపత్రికలో పూర్తి పేజీ ప్రకటన ఇచ్చారు. గత 15 ఏళ్లుగా డీఎంకే, అన్నాడీఎంకే ప్రభుత్వాలు ప్రకటనల కోసం చేసిన ఖర్చు ఎంత, ప్రజాధనం ఎంత ఖర్చు చేశారని 'చట్టపంచాయత్తు ఉద్యమ' నేత ఇళంగో సమాచార హక్కు చట్టం కింద ప్రజాసంబంధాల శాఖను వివరణ కోరారు. అయితే దీనికి సరైన సమాధానం రాకపోవడంతో 2015లో రాష్ట్ర సమాచార కమిషన్‌లో అప్పీల్ చేశారు. కేసు ప్రధాన కార్యదర్శిగా పని చేసి, పదవీ విరమణ చేసిన తర్వాత సమాచార కమిషన్ కమిషనర్‌గా నియమించబడిన కేఎస్ శ్రీపతి, న్యాయమూర్తిగా పని చేసి కమిషనర్‌గా నియమించబడిన ఎస్ఎఫ్ అక్బర్ ఎదుట 2015లో విచారణకు వచ్చింది. అప్పుడు ప్రజా ధనంతో పని చేసే ప్రభుత్వ కార్యాలయాల్లో కూర్చుని మాట్లాడటంలో తప్పులేదని పేర్కొంటూ ఇళంగో కమిషనర్ ప్రశ్నకు బదులిచ్చారు. కమిషన్‌లో లేచి నిలబడి సమాధానమివ్వాలని ప్రధాన కమిషనర్ తెలిపారు. ఇందుకు ఇళంగో నిరాకరించడంతో కమిషనర్‌ను అవమానించినట్లు తేనాంపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో ఇళంగోను అరెస్టు చేశారు. మూడు రోజులు పుళల్ జైలులో ఉంచారు. ఈ కేసు విచారణ సైదాపేట కోర్టులో సాగింది. ఈ నేపథ్యంలో 2015 నుంచి 140 వాయిదాలు జరిగిన నేపథ్యంలో సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత ఇళంగో మీద ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును న్యాయస్థానం కొట్టేసింది.

ఆలయంలో రీల్స్

మహిళా ధర్మకర్తపై చర్యలకు హైకోర్టు ఆదేశం

ఆర్కేనగర్: చెన్నై సమీపంలోని తిరువేర్కాడులోని ప్రసిద్ధి చెందిన దేవి కరుమారియమ్మన్ ఆలయంలో 12మంది మహిళలు డ్యాన్స్ చేసిన రీల్స్ సామాజిక మాధ్యమంలో విడుదల చేసిన వ్యవహారంలో తగిన చర్యలు తీసుకోవాలని దేవదాయశాఖను ఆదేశించాలని నాగపట్టిణానికి చెందిన జయప్రకాశ్ అనేవ్యక్తి మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ న్యాయమూర్తి దండపాణి ఎదుట విచారణకు వచ్చింది. పిటిషన్‌దారుడి తరఫున హాజరైన న్యాయవాది.. ఆలయంలో మహిళా ధర్మకర్త వళర్మతి, మహిళా సిబ్బంది స్వామి చిత్రపటం ఎదుట కుర్చీ వేసుకొని ఓ హాస్యనటుడి కామెడీని చిత్రీకరించి సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారన్నారు. వీడియోను న్యాయమూర్తికి చూపించారు. వళర్మతి, మహిళా సిబ్బందితో రీల్స్ చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని దేవదాయశాఖ కమిషనర్‌కు న్యాయమూర్తి ఆదేశించారు.



మహిళా సిబ్బందితో ఆలయ ధర్మకర్త వళర్మతి రీల్స్ చేస్తున్న దృశ్యం

శుభ్రతా కార్మికుల ఆందోళన

కోయంబత్తూరు: కోయంబత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సుమారు 500 మంది శుభ్రతా కార్మికులు పని చేస్తున్నారు. వీరు తమకు దీపావళి బోనస్ అందజేయాలని కోరుతూ శుక్రవారం ఆందోళనకు దిగారు. అనుమతి లేకుండా ఆందోళన నిర్వహించడంతో 80 మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేసి సాయంత్రం విడిచిపెట్టారు.



కోయంబత్తూరు: ఆందోళనలో పాల్గొన్న కార్మికులు

ప్రధానోపాధ్యాయుడిని విడుదల చేయాలని విద్యార్థులు... వేలూర్: లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన తిరుపత్తూర్ జిల్లాలోని పూనైకుట్టి పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని విడుదల చేయాలని కోరుతూ పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణి ఇటీవల అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సుబ్రమణిని అరెస్టు చేశారు. అధికారులు ఆయన్ను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో సదరు పాఠశాల విద్యార్థులు శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. సుబ్రమణికి మద్దతుగా ప్లకార్డులను ప్రదర్శించారు.

వ్యవసాయదారుల సంఘం తరఫున.. అరక్కోణం: రాణిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం తమిళనాడు వ్యవసాయదారుల సంఘం తరఫున ఆందోళన జరిగింది. ఇందులో సంఘ రాష్ట్ర ఉప కార్యదర్శి శరవణన్, జిల్లా అధ్యక్షుడు కాశీనాథన్ పాల్గొన్నారు. ఆర్కాడు తాలూకా చిన్నకుక్కండితోపు వీధిలోని సర్వే నెంబరు 46సీ/60కి చెందిన స్థలాన్ని మరో వ్యక్తిపై రిజిస్టరు చేయడాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. తమ న్యాయమైన కోరికలను వెంటనే పరిష్కారించాలని డిమాండ్ చేశారు.

రాబర్ట్ బ్రూస్ ఎన్నికల కేసు
గడువిస్తూ కోర్టు ఆదేశం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: లోక్‌సభ ఎన్నికల ఓటమిని వ్యతిరేకిస్తూ భాజపా అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌పై స్పందించేందుకు మద్రాసు హైకోర్టు రాబర్ట్ బ్రూస్‌కు మరింత సమయం ఇచ్చింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో నెల్లైలో పోటీ చేసిన భాజపా అభ్యర్థి నయినార్ నాగేంద్రన్, డీఎంకే-కాంగ్రెస్ కూటమి అభ్యర్థి రాబర్ట్ బ్రూస్‌తో పోటీపడి 1.65లక్షల ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. ఎన్నికలు ముగిసిన 45రోజుల్లోపు ఎన్నికల కేసు దాఖలు చేయాలనే కోర్టు ప్రక్రియ ప్రకారం నయినార్ నాగేంద్రన్ మద్రాసు హైకోర్టులో వ్యక్తిగతంగా హాజరై ఎన్నికల కేసు దాఖలు చేశారు. అందులో.. కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికల కమిషన్ అనుమతించిన మొత్తం కంటే ఎక్కువగా ఎన్నికల ఖర్చు చేశారన్నారు. ఆయన విజయం చెల్లదని ప్రకటించాలని కోరారు. ఈ కేసు గతంలో న్యాయమూర్తి జయచంద్రన్ ఎదుట విచారణ వచ్చింది. అప్పుడు రాబర్ట్ బ్రూస్ తరఫున బదులివ్వడానికి నాలుగు వారాలు గడువిచ్చారు. శుక్రవారం మళ్లీ విచారణకు వచ్చినప్పుడు రాబర్ట్ బ్రూస్ తరఫున బదులిచ్చేందుకు మరింత సమయం కావాలని కోరారు. తదుపరి విచారణ సమయంలో రాబర్ట్ బ్రూస్ బదులివ్వాలని నవంబరు 15కి వాయిదా వేశారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబం బలవన్మరణం



గోవిందరాజ్ కుటుంబం (పాతచిత్రం)

సేలం, న్యూస్‌టుడే: సేలం జిల్లాలో ఓ హెడ్ కానిస్టేబుల్ కుటుంబం ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. పోలీసుల కథనం మేరకు... సేలం ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో ఉన్న పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా గోవిందరాజ్ పనిచేస్తున్నారు. జిల్లాలోని కొండలాంబట్టి పోలీసు స్టేషన్ క్వార్టర్స్‌లో కుటుంబంతో పాటు నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోవిందరాజ్ గురువారం రాత్రి తన భార్య సంగీత (32), పిల్లలు రోహిత్ (7), దర్శిని (3)కి విషం తాగించి తర్వాత తానూ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించారు. బలవన్మరణానికి కారణాలు తెలియలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

సముద్ర అలల్లో చిక్కుకొని ఇద్దరు మహిళల మృతి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: సముద్ర అలల్లో చిక్కుకొని ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం మేరకు.. మదురై జీఆర్‌నగర్‌కు చెందిన 20 మందికిపైగా తూత్తుకుడి జిల్లాలోని పెరియసామిపురంలోని కులదైవ ఆలయానికి 15న వచ్చారు. శుక్రవారం ఉదయం వెంబార్ పెరియసామిపురం సముద్రంలో వాళ్లు స్నానాలు చేశారు. అలల వేగంతో ఇలక్కియ, కన్నియమ్మాల్, మురుగలక్ష్మి, శ్వేత, అనిత అనే ఐదుగురు మహిళలు సముద్రంలోకి వెళ్లిపోయారు. వారి అరుపులు విన్న మత్స్యకారులు సముద్రంలోకి దూకి అందరినీ బయటకు తీసుకొచ్చారు. ఇలక్కియ(21), కన్నియమ్మాల్(50) శ్వాస ఆడక మృతిచెందారు. మిగిలినవారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీతో బాలుడు...

ఆర్కేనగర్: డెంగీ బారినపడిన ఓ బాలుడు మృతి చెందాడు. తేని జిల్లా పెరియకుళం సంగముత్తిపట్టి ప్రాంతానికి చెందిన నాగరాజ్ డ్రైవర్. ఇతని కుమారుడు మోతిక్‌కుమార్ (10) ఆండిపట్టిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. గత వారం బాలుడికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ పరీక్షలు చేయగా డెంగీగా నిర్ధారణైంది. అదే ప్రాంతానికి చెందిన 8 మంది పిల్లలు కూడా డెంగీ బారినపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతూ మోతిక్‌కుమార్ గురువారం రాత్రి మృతి చెందాడు. సంగముత్తిపట్టి ప్రాంతంలో అపరిశుభ్రం కారణంగానే దోమలు ప్రబలి డెంగీ వ్యాపిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తూ రాస్తారోకో చేశారు.

వ్యాపారి దారుణహత్య



సయ్యద్ హుస్సేన్ (పాతచిత్రం)

పొన్నేరి, న్యూస్‌టుడే: మీంజూరు సమీప అరియన్‌వాయల్‌కు చెందిన సయ్యద్ హుస్సేన్ (40) షూమార్ట్ నిర్వహిస్తున్నాడు. ఇతను గురువారం రాత్రి దుకాణం మూసి ద్విచక్ర వాహనంపై స్నేహితుడు కరీంతో కలిసి ఇంటికి బయలుదేరాడు. ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనాన్ని హుస్సేన్ వాహనం ఢీకొంది. దీంతో అవతలి వాహనంపై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఆవేశం చెందిన అతను బండరాయితో దాడి చేయడంతో హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్నేహితుడు అతన్ని చెన్నై స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. మీంజూరు పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.

మెరీనా తీరంలో విద్యార్థి గల్లంతు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై మెరీనా సముద్ర తీరంలో ఓ కళాశాల విద్యార్థి అలల్లో చిక్కుకుని గల్లంతయ్యాడు. పోలీసుల కథనం మేరకు... చెన్నై ప్యారిస్ ప్రాంతానికి చెందిన కవియరసు (19) మైలాపూర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీఏ మూడో ఏడాది చదువుతున్నాడు. ఇతను తన స్నేహితుడు ఆది సహా ఆరుగురితో కలిసి శుక్రవారం మెరీనా బీచ్‌కు వెళ్లారు. స్నానం చేస్తుండగా భారీ అలల్లో ఆది, కవియరసు చిక్కుకుని గల్లంతయ్యారు. వెంటనే అక్కడున్న వారు గాలించి ఆదిని కాపాడి ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది కవియరసు కోసం గాలింపు చేపట్టారు.

క్రైం కార్నర్

హత్య కేసులో
తండ్రి, కుమారుడి అరెస్టు

సైదాపేట, న్యూస్‌టుడే: హత్య కేసులో తండ్రి, కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... కన్నియాకుమరి జిల్లా మరవన్ కాలనీ ప్రాంతానికి చెందిన స్టాన్లీరాయ్ (38) పదేళ్ల క్రితం బతుకుదెరువుకు నీలగిరి జిల్లా కోత్తగిరి ప్రాంతానికి వచ్చినట్లు తెలుస్తోంది. అక్కడ టైల్స్ వేసే పని చేస్తున్నాడు. ఆరు నెలల క్రితం కోత్తగిరి ప్రాంతానికి చెందిన దేవదాస్ అనే వ్యక్తితో అతనికి పరిచయం ఏర్పడింది. ఇద్దరూ మంచి మిత్రులుగా మారారు. అనంతరం ఇద్దరూ కలిసి కోత్తగిరి కోవిల్‌మేడు ప్రాంతంలోని ప్రభు అనే వ్యక్తి ఇంట్లో అద్దెకు ఉన్నారు. రెండు నెలల క్రితం స్టాన్లీరాయ్ తన సొంతూరికి వెళ్లి రెండు రోజుల ముందు కోత్తగిరికి వచ్చాడు. ఊరి నుంచి వచ్చిన అతన్ని దేవదాస్ ఇంటి అద్దె డబ్బులు అడిగాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తర్వాత బయటకు వెళ్లిన దేవదాస్ గురువారం అర్ధరాత్రి తన కుమారుడు నివాస్‌తో కలిసి వచ్చి స్టాన్లీరాయ్‌తో గొడవపడ్డాడు. అప్పుడు స్టాన్లీరాయ్‌ని దేవదాస్ వెనుక నుంచి పట్టుకోగా నివాస్ కత్తితో అతని గొంతుకోసినట్లు తెలుస్తోంది. స్టాన్లీరాయ్ కేకలు విన్న మరో స్నేహితుడు అక్కడికి రాగా దేవదాస్, అతని కుమారుడు బెదిరించి అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే స్టాన్లీరాయ్‌ని కోత్తగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు నిందితులు ఇద్దరిని శుక్రవారం వేకువజామున అరెస్టు చేశారు.

పేలుడు వస్తువులు నిల్వ ఉంచిన దుకాణదారుడు...



ముస్తాఫా

పళ్లిపట్టు: పళ్లిపట్టు ప్రాంతానికి చెందిన బాణసంచా దుకాణాల్లో జిల్లా వెనుకబడిన తరగతులు, మైనారిటీల సంక్షేమ అధికారిణి ధనలక్ష్మి శుక్రవారం తనిఖీలు చేశారు. వెంట తిరుత్తణి ఆర్డీవో దీప, తిరుత్తణి డీఎస్పీ కందన్, పళ్లిపట్టు తహసీల్దారు శివకుమార్ వెంట ఉన్నారు. పొదట్టూరుపేట కూడలి వద్ద ఉన్న ముస్తాఫా దుకాణంలో తనిఖీ చేసి 30 పెట్టెల్లో నాటు టపాసులు గుర్తించారు. అధికారుల ఫిర్యాదు మేరకు పళ్లిపట్టు పోలీసులు ముస్తాఫాను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుట్కా వ్యాపారిపై
గూండా చట్టం నమోదు



బాబు

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అరక్కోణం, పరిసర ప్రాంతాల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న వెంకటేశ్వరపురానికి చెందిన బాబు (38)ను పోలీసులు పలుమార్లు అరెస్టు చేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన ప్రతిసారి తన వ్యాపారం సాగిస్తూనే ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఎస్పీ కిరణ్ శృతి ఆదేశాలతో బాబుని అరక్కోణం పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్పీ సిఫారసు మేరకు జిల్లా కలెక్టరు చంద్రకళ బాబుపై గుండా చట్టం కింద చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అక్రమంగా తరలిస్తున్న బయో డీజిల్ స్వాధీనం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తూత్తుకుడిలో మోటర్ బోటు మత్స్యకారులను లక్ష్యంగా చేసుకుని బ్లాక్ మార్కెట్‌లో బయో డీజిల్ తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. దీని కారణంగా ఇంధన కంపెనీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. సదరు కంపెనీల ఫిర్యాదుతో పోలీసుశాఖ వాహనాల తనిఖీలు తీవ్రతరం చేసింది. ఇదిలా ఉండగా గురువారం రాత్రి తూత్తుకుడి హార్బర్‌కు బయో డీజిల్ విక్రయానికి వస్తున్నట్లు కోస్ట్‌గార్డ్ పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా ఉంచారు. అప్పుడు హార్బర్‌లోకి వస్తున్న లారీని చుట్టుముట్టారు. అందులో ఎలాంటి పత్రాలు లేని బయో డీజిల్‌ని గుర్తించారు. లారీ సహా రూ.8 లక్షల విలువైన 15 వేల లీటర్ల బయో డీజిల్‌ని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి మిల్లర్‌పురానికి చెందిన కందన్, మణికంఠన్‌ను అరెస్ట్ చేశారు.

రేషన్ బియ్యం...

పళ్లిపట్టు: పళ్లిపట్టు తాలూకా పొదట్టూరుపేటలో కొందరు రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు రెవెన్యూ శాఖ అధికారులకు సమాచారం అందింది. ఆ మేరకు సిబ్బందితో గ్రామంలోని పలు వీధుల్లో తనిఖీ చేశారు. ఆ సమయంలో కొందరు అధికారులను చూసి తమ వద్ద ఉన్న రేషన్ బియ్యాన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. సుమారు 750 కిలోల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని పళ్లిపట్టు పౌరసరఫరాలశాఖ గోదాముకు తరలించారు.

మహిళ వేషధారణలో రీల్స్

యువకుడిపై చర్యలకు డిమాండ్

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్‌లోని ప్రధాన రోడ్లపై శుక్రవారం ఓ యువకుడు మహిళ వేషధారణలో ద్విచక్ర వాహనాన్ని అతి వేగంతో నడుపుతూ చక్కర్లు కొట్టాడు. యూట్యూబ్‌లో రీల్స్ కోసం అతను ఇలా చేశాడని తెలిసింది. పోలీసులు అతని ఆచూకీ తెలుసుకుని కఠిన చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.



మహిళ వేషధారణలో బైక్ నడుపుతున్న యువకుడు